సాక్షి నంద్యాల

శుక్రవారం, 9, ఫిబ్రవరి, 2024



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన స్నేహలత బృందం గురువారం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం భక్తులకు అలరించింది.



అహోబిలేశుడికి పూజలు

ఆళ్లగడ్డ: తన పెండ్లికి భక్తులను ఆహ్వానించేందుకు పల్లకీలో బయలుదేరిన అహోబిలేశుడిని భక్తులు దర్శించుకుంటున్నారు. పార్వేట పల్లకీ గురువారం ఆళ్లగడ్డ పాతబస్టాండ్‌కు చేరుకుంది.



108లో గర్భిణి ప్రసవం

గడివేముల: స్థానిక ఎరుకల కాలనీకి చెందిన గర్భిణీ నాగేంద్రమ్మను గురువారం 108లో మిడ్తూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆడబిడ్డను ప్రసవించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

న్యూస్‌రీల్

రీజనల్ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ చిత్తూరులో నిర్వహించే రీజనల్ జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాపరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం చిత్తూరు విజ్ఞాన సుధ డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్ మేళాకు దాదాపు 100 కంపెనీల ప్రతినిధులు వచ్చే అవకాశం ఉందని, యువతి యువకులు ఇంటర్వ్యూలకు హాజరై ఉద్యోగాలు సాధించాలన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, బీఫార్మసీ, ఎంఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన అభ్యర్థుల వయస్సు 18 నుంచి 30 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. వివరాల కోసం 9493210966, 8465830771ను సంప్రదించాలన్నారు.

ఏపీపీఎస్సీ బోర్డు మెంబర్‌గా సిద్ధం శివరాం



నంద్యాల(అర్బన్): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మెంబర్‌గా సిద్ధం శివరాంను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామానికి చెందిన సిద్ధం శివరాం గత ప్రభుత్వాల్లో రెండు విడతలుగా నంద్యాల మార్కెట్ యార్డు చైర్మన్‌గా విధులు నిర్వహించారు. 2002లో న్యాయవాద వృత్తిని చేపట్టి పేద ప్రజల పక్షాన నిలిచి వాదించారు. రాయల్ గ్రీన్ యూత్ ఆర్గనైజేషన్ స్థాపనతో పేద విద్యార్థులకు సాయం అందించడమే కాకుండా పేద వధువులకు పెళ్లి కానుకలు వంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తనపై నమ్మకం ఉంచి ఏపీపీఎస్సీ మెంబరుగా నియమించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఏపీపీఎస్సీ మెంబరుగా నియమించిన సిద్ధం శివరాంను పలువురు న్యాయవాదులు అభినందించారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలపై నేడు కలెక్టర్ సమీక్ష

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 1 నుంచి 11వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం చేపట్టాల్సిన సౌకర్యాలపై శుక్రవారం జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు సమీక్ష నిర్వహించనున్నారు. దేవస్థాన పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమీక్షకు కర్నూలు, నంద్యాల, ప్రకాశం జిల్లాలకు చెందిన అన్ని శాఖల అధికారులు హాజరుకానున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన పనులపై శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తారు. మంచినీటి సరఫరా, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, వసతి, లైటింగ్ ఏర్పాట్లు, ఉత్సవ క్రతువులు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పార్కింగ్ ప్రదేశాలు, ఆరుబయలు తాత్కాలిక వసతి, శౌచాలయాలు తదితర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించనున్నారు.

ట్రస్ట్‌బోర్డు సమావేశం వాయిదా

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో గురువారం ఉదయం నిర్వహించాల్సిన దేవస్థాన ధర్మకర్తల మండలి సమావేశం తాత్కాలికంగా వాయిదా పడింది. అనివార్య కారణాల వలన వాయిదా పడిందని, సమావేశానికి మరో తేదీన నిర్ణయించాల్సిందని ఆలయ అధికారులు తెలిపారు.



పంటకు బీమా.. రైతుకు ధీమా

పారదర్శకంగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా

- ఫైసా ఖర్చు లేకుండా రైతులందరికీ వర్తింపు
- ఈ–క్రాప్ నమోదు, ఈ–కేవైసీ మాత్రమే అర్హత
- చంద్రబాబు పాలనలో 321 మంది రైతుల బలవన్మరణం
- ఉక్కిరిబిక్కిరి చేసిన వరుస కరువు కాటకాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.1,065.51 కోట్ల పరిహారం

కర్నూలు(అగ్రికల్చర్): సుదీర్ఘ పాదయాత్రలో రైతుల కష్టాలు, కన్నీళ్లు ప్రత్యక్షంగా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రైతుల్లో భరోసా నింపేందుకు శ్రీకారం చుట్టారు. ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సమయంలో పెట్టుబడుల కోసం పడుతున్న కష్టాలు చూసి వైఎస్‌ఆర్ రైతుభరోసాకు శ్రీకారం చుట్టారు. అలాగే వరుస కరువు కాటకాలతో నష్టాలు మూటకట్టుకుంటున్న రైతుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు వైఎస్‌ఆర్ ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారు. నోటిఫై చేసిన పంటలను బీమా పరిధిలోకి తెచ్చి అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల వల్ల నష్టపోయిన రైతన్నలకు ఆర్థిక తోడ్పాటును అందిస్తోంది. నిబంధనల ప్రకారం బీమా సదుపాయం పొందడానికి దిగుబడుల ఆధారిత, వాతావరణ ఆధారిత బీమా కింద ఆహార పంటలకు 2 శాతం, వాణిజ్య పంటలకు 5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంది. రైతులపై ఒక్క రూ పాయి కూడా భారం పడరాదనే ఉద్దేశంతో రైతుల వాటా ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తూ వైఎస్‌ఆర్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తోంది. ప్రతి ఏటా ప్రభుత్వం బీమా కోసం వివిధ పంటలను నోటిఫై చేస్తుంది. ఆయా పంటలు ఈ–క్రాప్‌లో నమోదు, పంటలను ధ్రువీకరిస్తూ రైతులు ఈ–కేవైసీ చేయడమే బీమాకు అర్హత. అర్హత కలిగిన ఏ ఒక్క రైతు నష్టపోకుండా పకడ్బందీగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా అమలవుతోంది.

పారదర్శకంగా బీమా పరిహారం

బీమా పరిహారం విడుదలను ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా చేపట్టింది. ఈ–క్రాప్‌లో నోటిఫై చేసిన పంటలను నమోదు చేసుకున్న రైతుల వివరాలను ఆర్‌బీకేల వారీగా ప్రదర్శించి అభ్యంతరాలను సేకరించారు. బీమా క్లెయిమ్‌లను కూడా ఆర్‌బీకే వారీగా ప్రదర్శనకు ఉంచుతున్నారు. మూడు రో జుల పాటు రైతుల పరిశీలనకు పెట్టి అభ్యంతరాలు స్వీకరిస్తుంది. వాటిని పరిష్కరించిన తర్వాత రైతుల బ్యాంకు ఖాతాలకు బీమా సొమ్మును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేస్తున్నారు.



ఒకే కుటుంబానికి రూ.2 లక్షల పరిహారం

మాకు ఏడు ఎకరాల భూమి ఉంది. మరో 20 ఎకరాల వరకు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాం. ఉల్లి, పత్తి, కంది తదితర పంటలు వేస్తున్నాం. చంద్రబాబు ఐదేళ్లలో పాలనలో ఒక్క రూపాయి కూడా బీమా పరిహారం అందలేదు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో నాకు ఒక్కనికే రూ.78 వేలు, మొత్తం కుటుంబానికి రూ.2లక్షల వరకు పరిహారం వచ్చింది. ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించకపోయినా ప్రభుత్వం మాకు అండగా నిలిచింది.

– జి.హనుమంతురెడ్డి, ఎ.గోకులపాడు, కల్లూరు మండలం



పంటల బీమా ఆదుకుంది

మాకు 2.25 ఎకరాల భూమి మాత్రమే ఉంది. సన్నకారు రైతునైన నాకు వైఎస్‌ఆర్ ఉచిత పంటల బీమా ఎంతగానో ఆదుకుంది. ఈ–క్రాప్‌లో పంటలను నమోదు చేయించుకొని ఈ–కేవైసీ చేయించుకున్నా. 2021లో ఉల్లి, 2022 వేరుశనగ సాగు చేశాం. పంటలు దెబ్బతినడంతో వైఎస్‌ఆర్ ఉచిత పంటల బీమా కింద ఊరట లభించింది. రెండేళ్లలో రూ.40 వేల వరకు బీమా లభించింది.

– చింతకాయల రాజశేఖర్, రామళ్లకోట, వెల్దుర్తి మండలం

నాడు..

2014–15 నుంచి 2018–19 వరకు టీడీపీ పాలనలో వరుసగా ఐదేళ్లు కరువు తాండవించింది. ఒక్క ఏడాది మినహా ప్రతి ఏటా కరువు మండలాలను ప్రకటించారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో 321 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. టీడీపీ హయాంలో సంపన్న రైతులు మాత్రమే బీమా చేయించుకునేవారు. ఆహార పంటలకు 2 శాతం, వాణిజ్య పంటలకు 5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉండటంతో సామాన్య, మధ్య తరగతి రైతులు ప్రీమియం చెల్లించలేక మిన్నకుండిపోయారు. ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో బీమా కింద 1,65,957 మంది రైతులకు చెల్లించిన పరిహారం రూ.259.3 కోట్లు మాత్రమే. ఇందులో రైతులు ప్రీమియం కిందనే దాదాపు రూ.100 కోట్లకు పైగా చెల్లించడం గమనార్హం.

నేడు..

వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన మొదటి ఏడాది(2019–20)లో ఒక్క రూపాయి ప్రీమియంతో నోటిఫై చేసిన పంటలకు బీమా సదుపాయం కల్పించింది. 2020–21 నుంచి వైఎస్‌ఆర్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. నోటిఫై చేసిన పంటలు ఈ–క్రాప్‌లో నమోదైతే చాలు పంటల బీమా సదుపాయాన్ని వర్తింపజేసింది. సన్న, చిన్న, మధ్య అనే తారతమ్యం లేకుండా, రాజకీయాలకు అతీతంగా ఈ–క్రాప్ డేటా ఆధారంగా రైతులకు బీమా సదుపాయం కల్పించడం విశేషం. ఉచిత పంటల బీమా కింద రైతన్నలకు చెల్లించిన పరిహారం రూ.1065.61 కోట్లు. అది కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేశారు.

2019 నుంచి 2022 వరకు వచ్చిన బీమా పరిహారం ఇలా..

సంవత్సరం	లబ్ధి పొందిన రైతులు	అందిన పరిహారం (రూ.కోట్లలో)
2019	2,70,786	320.00
2020	1,85,744	181.11
2021	2,21,705	371.89
2022	2,35,743	192.51
మొత్తం	9,14,016	1065.51

రూపాయి ఖర్చు లేకుండా రూ.1065.51 కోట్ల లబ్ధి

వైఎస్‌ఆర్ ఉచిత పంటల బీమా కింద 2019–2020 సంవత్సరానికి ఉమ్మడి జిల్లాకు రూ.501.11 కోట్లు రైతులకు పరిహారం చెల్లించినట్లు స్పష్టమవుతోంది. 4,57,530 మంది రైతులకు ప్రయోజనం కలిగింది. 2021 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రికార్డు స్థాయిలో విభజిత కర్నూలు జిల్లాలో 2,21,705 మంది రైతులకు రూ.371.89 కోట్ల పరిహారం లభించడం విశేషం. 2022 ఖరీఫ్ పంటలకు సంబంధించి 2,35,743 మంది రైతులకు రూ.192.51 కోట్ల పరిహారం లభించింది. మొత్తంగా వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతులకు రూ.1,045.61 కోట్లు బీమా పరిహారంగా చెల్లించడం విశేషం.

రైతులకు అండగా ఉచిత పంటల బీమా

రైతులపై ఒక్క రూపాయి భారం పడకుండా ప్రభుత్వం వైఎస్‌ఆర్ ఉచిత పంటల బీమా అమలు చేస్తోంది. ఇందుకోసం నోటిఫై చేసిన పంటలు ఈ–క్రాప్‌లో నమోదయితే చాలు ప్రతి రైతుకు బీమా వర్తిస్తుంది. కరువు రైతులకు ఉచిత పంటల బీమా ఎంతో ఊరట, ఉపశమనం కలిగిస్తోంది. ఐదేళ్లలో ఉచిత పంటల బీమా కింద రూ.1,065.61 కోట్ల మొత్తాన్ని పరిహారంగా అందింది. ఈ స్థాయిలో బీమా అందించడం సాధారణ విషయం కాదు. – పీఎల్ వరలక్ష్మి, డీపీఓ

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి



అధిక సాంద్రపద్ధతిలో పత్తిసాగు విధానంపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ పోచా, వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌రెడ్డి, శాస్త్రవేత్తలు తదితరులు

- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

బనగానపల్లె: వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి రైతులకు సూచించారు. గురువారం మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కిసాన్ మేళా కార్యక్రమాన్ని ఎంపీ పోచా, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ భరత్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేవీకేలో రైతుల సంక్షేమం కోసం కిసాన్‌మేళా కార్యక్రమాలతో పాటు మరెన్నో కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునాతన సాంకేంతిక పద్ధతులు వినియోగించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. రైతులు వ్యవసాయ రంగంతో పాటు పాడిపరిశ్రమ ఇతర వ్యవసాయ అధారిత రంగాలపై శ్రద్ధ చూపాలన్నారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమ కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు చేశారన్నారు. ఆర్బీకేలు, అగ్రిల్యాబ్‌లు, గోదాములు తదితరాలు అందుబాటులోకి తెచ్చి రైతు సమస్యలను పరిష్కరించారన్నారు. సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి మాట్లాడుతూ వర్షాధార పద్ధతిలో పత్తి పంటసాగుపై ఆమె మెలకువలు వివరించారు. కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, తదితరులు మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావపరిస్థితుల్లో అధిక సాంద్రపద్ధతి ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ పద్ధతిలో పత్తి సాగు విధానంపై పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయంలో నూతన పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించిన పలువురు రైతులను అవార్డులతో సన్మానించారు. కార్యక్రమంలో ఆత్మా పీడీ వరలక్ష్మి, ప్రొగ్రామ్ ఆర్డినేటర్ సరళమ్మ, ఏడీఏ రాజశేఖర్ తదితర వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

యాత్ర–2కు నీరా‘జనం’

- మొదటి రోజు హౌస్‌ఫుల్
- టికెట్ల కోసం బారులుదీరిన అభిమానులు

నంద్యాల(అర్బన్/వ్యవసాయం): మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జీవిత కథ అధారంగా తీసిన యాత్ర–2 చిత్రానికి ప్రేక్షకులు నీరాజనం పలుకుతున్నారు. 2019లో మహి వి.రాఘవ దర్శకత్వంలో మళయా లం సీనియర్ నటుడు మమ్ముట్టి నటించిన యాత్ర–1కు సీక్వెల్‌గా యాత్ర–2 గురువారం విడు దల కావడంతో అభిమానులు బ్రహ్మరథం పట్టారు. నంద్యాల పట్టణంలో నిధి, రఘురామ థియేటర్లలో యాత్ర–2 సినిమా విడుదల కాగా బెనిఫిట్ షో నుంచి ఐదు ఆటలకు హౌస్‌ఫుల్ బోర్డులు దర్శనమిచ్చా యి. టికెట్ల కోసం అభిమానులు బారులుదీరారు. వైఎస్సార్ అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి దంపతులు తదితరులు సినిమాను వీక్షించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కడప ఎంపీగా భారీ మెజార్టీతో గెలవడం మొదలు జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ అరంగేట్రం, రాజకీయాల్లో పడిన కష్టాల వరకు పలు సన్నివేశాలు కళ్లకు కట్టినట్లు దర్శకుడు ఆవిష్కరించారు. ‘నేను ఎవరో ఈ ప్రపంచానికి ఇంకా తెలియకపోవచ్చు.. కాని ఒకటి గుర్తుపెట్టుకోండి.. నేను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కొడుకును’ తదితర డైలాగులతో ప్రేక్షకులు ఈలలు, కేరింతలతో థియేటర్లు మారుమోగాయి.



యాత్ర–2 సినిమాను వీక్షిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి దంపతులు



చిత్రంలో ఓ సన్నివేశం

వినియోగదారులకు నాణ్యమైన సేవలు

- ఏపీఎస్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష్‌రావు వెల్లడి

కర్నూలు(అగ్రికల్చర్): వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూటరీ కంపెనీ లిమిటెడ్(ఏపీఎస్‌పీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష్‌రావు అన్నారు. గురువారం ఆయన కర్నూలులో పర్యటించారు. ఉదయం కర్నూలు శివారు కార్బైడ్ ఫ్యాక్టరీ సమీపంలో నిర్మిస్తున్న ఏపీఈఆర్‌సీ భవనం పురోగతిని పరిశీలించారు. మే నెల చివరి నాటికి భవనం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కొత్తబస్టాండు సమీపంలోని విద్యుత్ భవన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా అధికారులతో ఎస్‌ఈ ఉమాపతితో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిచాంగ్ తుపాను ప్రభావంతో అతలాకుతలమైన నెల్లూరు సర్కిల్‌కు వెళ్లి అతి తక్కువ సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంలో కర్నూలు సర్కిల్ అధికారులు, సిబ్బంది సేవలు ఎనలేనివన్నారు. ఇందుకు గుర్తింపుగా 40 మంది అధికారులు, వివిధ కేటగిరిల సిబ్బందికి సీఎండీ సంతోష్‌రావు, ఎస్‌ఈ ఉమాపతిని జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎస్‌ఈ ఉమాపతి మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాల నివారణకు, విద్యుత్ బిల్లులు 100 శాతం వసూలుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. కర్నూలు సర్కిల్‌కు మరింత మంచి పేరు తెచ్చేందుకు అన్ని విధాల కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నంద్యాల ఈఈ రమణారెడ్డి, ఆదోని ఈఈ రాజేష్, కర్నూలు టౌన్ డీఈఈ చక్రపాణి, కర్నూలు రూరల్ డీఈఈ వెంకటేశ్వర్లు, డోన్ డీఈఈ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒక్క మాత్రతో నులిపేద్దాం

- ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ
- నేడు 18 ఏళ్ల లోపు విద్యార్థినీ, విద్యార్థులకు మాత్రల పంపిణీ



కడుపులో నులిపురుగులు

గోస్పాడు: చిన్నారులను పీడించే అనారోగ్య సమస్యల్లో నులిపురుగులు ప్రధానమైనవి. ఈ పురుగులు పిల్లల కడుపులో చేరి మెలిపెడుతూ పిల్లల్లో పేలతనం, నీరసం, ఆహారం సరిగా తీసుకోకపోవడం తరచూ కనిపిస్తుంటుంది. ఈ సమస్యను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం ఆరు నెలలకు ఒకసారి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని భారీ ఎత్తున చేపట్టనుంది. ఈ మేరకు అంగన్‌వాడీలు, పాఠశాలలు, జూనియర్, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థిని, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలో 184 కళాశాలలు, 1,663 అంగన్‌వాడీ కేంద్రాలు, 1,217 పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా గుర్తించారు. వీటి పరిధిలో 87,123 మంది ఒక సంవత్సరం నుంచి రెండు సంవత్సరాల లోపు పిల్లలు, 3,24,147 మంది 2 నుంచి19 ఏళ్లలోపు పిల్లలు ఉన్నట్లు జిల్లా వైద్యశాఖ అధికారులు గుర్తించారు. వీరందరికీ ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. ఏదైనా పరిస్థితుల దృష్ట్యా 9వ తేదీన మాత్రలు తీసుకొని వారు ఉంటే వారి కోసం మాప్ అప్‌డే రోజున ఈనెల 16వ తేదీ మరోమారు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మాత్రలు అందజేయనున్నారు.

నులిపురుగులు వ్యాపించే విధం

నులిపురుగులు ఉన్న వ్యక్తి మల విసర్జన ద్వారా గుడ్లు నేలలోకి, తద్వారా తాగునీరు, గాలి ద్వారా ఆహార పదార్థాలపై చేరతాయి.

వ్యాధి లక్షణాలు

ఆకలి తగ్గిపోవడం, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు (రక్తవిరేచనాలు కూడా కావచ్చు), పోషకాహారలోపం, రక్తహీనత, తరచుగా ఇన్ఫెక్షన్లకు గురికావడం



శిరివెళ్లలో వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ, అధికారులు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవడం
- చేతి గోళ్లను వారానికి ఒకసారి కత్తిరించుకోవడం
- వండిన ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూతలు పెట్టడం
- కూరగాయలు, పండ్లు మొదలైన వాటిని వండటానికి ముందు శుభ్రంగా కడగటం
- మలవిసర్జనకు మరుగుదొడ్డినే ఉపయోగించాలి
- పాదరక్షలు ధరించాలి

జాగ్రత్తలు తీసుకోవాలి



శరీరంలోకి ప్రవేశించే పురుగులు మూడురకాలు. ఏలిక పాములు, నులిపురుగులు, కొంకెర పురుగులు. వీటి నివారణకు ఆల్బెండజోల్ తీసుకోవడం ఒక్కటే మార్గం. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు కూడా తీసుకోవచ్చు. ఏడాది నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు అల్బెండజోల్ సగం మాత్ర 200 ఎంజీ) నీటిలో కలిపి తాపాలి. 2 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు 400 ఎంజీ మాత్రను మధ్యాహ్నం భోజనం తరువాత చప్పరించేలా చూడాలి. మింగకుండా వైద్య సిబ్బంది పర్యవేక్షించాలి.

– గోపాల్, వైద్యాధికారి, గోస్పాడు

మాత్రల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు



ఈ నెల 9వ తేదీన జిల్లా అంతటా ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలకు పంపిణీ చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశాం. 4,11,270 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేయనున్నాం. భోజనం చేసేముందు, ఇతర కాలకృత్యాలు తీర్చుకున్న అనతంరం తప్పనిసరిగా చేతులను సబ్బుతో శుభ్రపరచుకోవాలి. గోర్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవడంతో పాటు పరిశుభ్రమైన ఆహారపదార్థాలను తీసుకోవాలి. – వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, నంద్యాల

సుర్రుమంటున్న సూరీడు!

- వేసవి మొదలు కాకముందే భానుడి భగభగలు
- ఉమ్మడి జిల్లాలో పెరిగిన ఉష్ణోగ్రతలు
- తగ్గిన చలి ప్రభావం



కర్నూలు(అగ్రికల్చర్): వేసవి కాలం రాకముందే ఫిబ్రవరి మొదటి పక్షంలోనే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. ఫసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ప్రభావంతో వేసవి మరింత వేడిగా ఉటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మామూలుగా అయితే ఫిబ్రవరి మొదటి పక్షంలో 35 డిగ్రీల వరకు మాత్రమే ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. గతేడాది ఇదే సమయంలో 35–36 డిగ్రీల వరకు ఉన్నాయి. ఈ సారి మాత్రం 38 డిగ్రీలు దాటిపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2023–24లో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, వాహనాల సంఖ్య పెరిగి, వాయు కాలుష్యం ఎక్కువగా ఉండటం ఉష్ణోగ్రతలు పెరుగడానికి కారణాలుగా వాతవరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

కర్నూలులో 38.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

గురువారం కర్నూలు నగరంలోనే గరిష్ట ఉష్ణోగ్రత 38.4, కనిష్ట ఉష్ణోగ్రత 22.4 డిగ్రీలు నమోదైంది. గడివేముల, ఎమ్మిగనూరు, పాములపాడు, సి.బెళగల్, కృష్ణగిరి, గోస్పాడు మండలాల్లో సాయంత్రం 4 గంటల సమయంలో కూడా 36.7 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంది. చలికాలం ఇంకా పూర్తి కాలేదు అయినా భారీగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. మార్చి నుంచి మే చివరి వరకు వేసవి నిప్పుల కొలిమిగా మారే ప్రమాదం ఉంది.

ఈ సారి చలి తీవ్రత తక్కువే...

ఈ ఏడాది చలి తీవ్రత తక్కువగా ఉంది. మొదట్లో కొద్ది రోజులు చలి ప్రభావం కనిపించినప్పటికీ త ర్వాత దాని ప్రభావం తగ్గింది. సంక్రాంతి సమయంలో కూడా చలి తీవ్రత అంతగా లేదు. రాత్రి ఉష్ణోగ్రతలు 22 డిగ్రీల కుపైగా నమోదుదవుతున్నాయి. చలికాలం ముగిసి, వేసవి ముందస్తుగా మొదలు కానుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

క్లుప్తంగా

దేవదాయ శాఖలో సహాయ కమిషనర్లకు పదోన్నతులు

కర్నూలు కల్చరల్: దేవదాయ శాఖలో పలువురు సహాయ కమిషనర్లు డిప్యూటీ కమిషనర్లుగా పదోన్నతి పొందారు. బుధవారం రాత్రి దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు డివిజన్ ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పట్టెం గురు ప్రసాద్ డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి కల్పించి అక్కడే రెగ్యులర్ డీసీగా నియమించారు. కర్నూలు సహాయ కమిషనర్‌గా ఉన్న ఎం. రామాంజనేయులు డీసీగా పదోన్నతి కల్పించి నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం మద్దిలేటి స్వామి దేవస్థానం ఈఓగా, జేవీఈఓగా, ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం ఈఓగా ఉన్న వాణి డీసీగా పదోన్నతి పొంది కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం డిప్యూటీ ఈఓగా, శ్రీశైలం సహాయ కమిషనర్‌గా ఉన్న హెచ్.జి.వెంకటేష్ డీసీగా పదోన్నతి పొంది ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం ఈఓగా నియమితులయ్యారు. వీరందూ పోస్టింగ్ పొందిన స్థానాలకు చార్జ్ తీసుకున్నారు. ఏసీల నుంచి డీసీల పదోన్నతులు పూర్తి కావడంతో గ్రేడ్-1 ఈఓలకు సహాయ కమిషనర్లుగా పదోన్నతులు కల్పించి ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

ఆలయానికి పూర్వ వైభవం



మాట్లాడుతున్న రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల కొండపై శ్రీకృష్ణదేవరాయల పరిపాలన కాలంలో నిర్మించిన పురాతన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు రామ్‌కో యూనిట్‌హెడ్ రెడ్డి నాగరాజు అన్నారు. గురువారం ప్రెసిడెంట్ అడ్మిన్ రామరాజు, జనరల్ మేనేజర్ రవికుమార్‌తో కలిసి ఆలయంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామ్‌కో ఆధ్వర్యంలో రూ.7 కోట్ల వ్యయంతో ఆలయాన్ని సుందరంగా తీరిదిద్దుతున్నామన్నారు. ఇప్పటికే గర్భగుడిలో పనులు పూర్తయినట్లు చెప్పారు. పనులు పటిష్టంగా ఉండేలా చేపడుతున్నామన్నారు. మే నాటికి పనులు పూర్తి దిశగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గ్రామపెద్దలు,ప్రజాప్రతినిధులతో మరో మారు సమావేశమై ఆలయంలో జరగుతున్న పనులు, ఇంకా చేపట్టాల్సిన వాటిపై చర్చిస్తామన్నారు.

పల్లెబాటల్లో ప్రగతి వేగం

- ప్రధాన రహదారులకు అనుసంధానంగా గ్రామీణ రోడ్లు
- రూ.189.29 కోట్ల నాబార్డు నిధులతో పనులు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో బాగుపడనున్న 257.79 కిలోమీటర్లు రోడ్లు
- ప్రారంభమైన 39 పనులు



కోడుమూరు మండలం క్రిష్ణాపురం రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు



కర్నూలు- గుంటూరు మెయిన్ రహదారి నుంచి పుల్లాపురం మీదుగా కొత్తపేటకు వేస్తున్న రోడ్డు

కర్నూలు(అర్బన్): దశాబ్దాల తరబడి గుంతలు పడిపోయి, కనీసం నడిచేందుకు కూడా వీలు లేని గ్రామీణ రోడ్లు అభివృద్ధి చెందుతున్నాయి. ప్రధాన రహదారులను కలుపుతూ చేపట్టిన పల్లె రోడ్ల పనులు శరవేగంగా సాగుతున్నాయి. నాబార్డు నిధులు రూ.189.29 కోట్లతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 39 పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తయితే రెండు జిల్లాల్లో 257.79 కిలోమీటర్ల మేర రోడ్లు అభివృద్ధి చెందనున్నాయి. రహదారులు అభివృద్ధి చెందుతుండటంతో పల్లె ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అందిన ప్రత్యేక ఆదేశాల మేరకు కర్నూలు జిల్లాలో 11, నంద్యాల జిల్లాలో 28 రోడ్లను బాగు చేస్తున్నారు. ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.187.27 కోట్లతో పాలనా అనుమతులు కూడా మంజూరు చేసింది. దీంతో ఆయా పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేసేందుకు పీఆర్ ఇంజినీర్లు ప్రత్యేక చర్యలు చేపట్టారు.



గతంలో మద్దికెర - ఆలూరు రోడ్డు



ప్రస్తుతం మద్దికెర - ఆలూరు రోడ్డు పనులు

వేగంగా జరుగుతున్న పనుల్లో కొన్ని ...

- పత్తికొండ నియోజకవర్గం మండల కేంద్రమైన మద్దికెర నుంచి మొలగవెల్లి మీదుగా ఆలూరు వరకు రూ.8.15 కోట్లతో 14.90 కిలోమీటర్లు అభివృద్ధి చేస్తున్నారు.
- కోడుమూరు మండలం కర్నూలు - బళ్లారి ప్రధాన రహదారి నుంచి క్రిష్ణాపురం వరకు రూ.2.97 కోట్లతో 4.10 కిలోమీటర్ల మేర రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు.
- కోడుమూరు మండలం వర్కూరు నుంచి మెరుగుదొడ్డి వరకు రూ.4.50 కోట్లతో 12.05 కిలోమీటర్ల మేర రోడ్డును వేస్తున్నారు.
- దేవనకొండ మండలం కర్నూలు - బళ్లారి మెయిన్ రోడ్డు నుంచి కొత్తపేట మీదుగా పుల్లాపురం వరకు రూ.3 కోట్లతో 5.8 కిలోమీటర్ల మేర కొత్త రోడ్డు వేస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ

ప్రాధాన్యత రోడ్ల పనుల్లో భాగంగా చేపట్టిన పనులు పూర్తయితే దాదాపు వంద గ్రామాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 11 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ పనులు కొనసాగుతున్నాయి. వీటిని పూర్తి నాణ్యతతో నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖకు చెందిన అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఏఈ స్థాయి నుంచి డీఈఈ, ఈఈ, ఎస్ఈ వరకు వారంలో ఎవరో ఒక అధికారి ఈ పనులను పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు చేస్తున్నారు. దీంతో పనుల్లో వేగం పెరుగుతోంది. దశల వారీగా నాణ్యతను సంబంధిత అధికారులు పరీక్షించిన తర్వాత మరో దశ పనులు చేపడుతున్నారు.

నిధుల కొరత లేదు



ప్రభుత్వం ఆమోదించిన రోడ్ల పనులకు ఎలాంటి నిధుల కొరత లేదు. ఈ పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి నాణ్యతతో పూర్తి చేయనున్నాం. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో మొత్తం 39 రోడ్ల పనులు ప్రారంభం అయ్యాయి. ఈ రోడ్ల పనులు పూర్తయితే రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ఆయా నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు కూడా ఈ పనులను వేగంగా పూర్తి చేయించేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

– కే సుబ్రమణ్యం, పీఆర్ ఎస్ఈ

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్



దొంగను అరెస్ట్ చూపుతున్న పోలీస్‌లు

శిరివెళ్ల: ఆంధ్ర, తెలంగాణలో వివిధ ఆలయాలు, ఇళ్లలో చోరీకి పాల్పడిన అంతరాష్ట్ర దొంగ సంపంగి శ్రీరాములును గురువారం పోలీస్‌లు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకట్రామయ్య వివరాలను వెల్లడించారు. శిరివెళ్ల మండలం వెంకటాపురంలోని నాగాంజనేయులు గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబీకులతో కలసి పొలం పనులకు వెళ్లారు. అప్పటికే బైక్‌పై గ్రామానికి చేరుకున్న బనగానపల్లె మండలం పలుకూరుకు చెందిన శ్రీరాములు, అదే మండలం యనకండ్లకు చెందిన సుబ్రమణ్యం తాళం వేసిన ఇంటిని గుర్తించి చోరీకి పాల్పడ్డారు. సుబ్రమణ్యం బైక్‌పై ఇంటి ముందుండగా, శ్రీరాములు ఇంట్లోకి వెళ్లి బీరువాలోని రెండు బంగారు చైన్లు, మూడు బంగారు ఉంగరాలు, ఒక జత బంగారు ముక్కు పుడక, ఒక జత చిన్ని మాటీలు, సుమారు 15 తులాల వెండి కాళ్ల పట్టీలు, రూ. 15 వేల నగదును మూటగట్టుకున్నాడు. అదే సమయంలో ఇంటి యజమాని వచ్చి కేకలు వేయడంతో పారిపోతున్న దొంగలను వెంబడించారు. సుబ్రమణ్యం బైక్‌పై పరారీ కాగా శ్రీరాములను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టుబడిన దొంగపై గతంలో జలదుర్గం స్టేషన్‌లో చోరీ కేసు నమోదయిందన్నారు. ఆ చోరీ కేసుకు చెందిన 2 తులాల బరువు గల బంగారు చైన్, ఒక జత బంగారు కమ్మలు, 23 తులాల జత వెండి పట్టీలను స్వాధీన పర్చుకున్నామన్నారు. దొంగపై కర్నూలు, ఓర్వకల్లు, తుని, తెలంగాణలోని అచ్చంపేట, ప్రకాశం జిల్లా కనిగిరి, బేతంచెర్ల, నందివర్గం, వెల్దుర్తి స్టేషన్‌లో పలు కేసులున్నాయన్నారు. పరారీలో ఉన్న మరో దొంగ సుబ్రమణ్యంను అరెస్ట్ చేస్తామన్నారు. సమావేశంలో సీఐ వంశీధర్, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

తండ్రి, కుమారుడు దూరమయ్యారని..

- మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



కంబయ్య(ఫైల్)

కొలిమిగుండ్ల: కుటుంబంలో నెలన్నర వ్యవధిలో ఇద్దరు సభ్యులను కోల్పోయిన వ్యక్తి మానసికంగా కుంగిపోయి ఓ వ్యక్తి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ గోపీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బెలుం గ్రామానికి చెందిన కొయిటాకు కంబయ్య(35) వ్యవసాయంతో పాటు నాపరాతి గనిలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. నెలన్నర క్రితం కంబయ్య తండ్రి చిన్న దాసన్న, 15 రోజుల క్రితం రెండేళ్ల కుమారుడు కమాల్ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కొద్ది రోజుల నుంచి మానసింగా కుంగిపోతూ వచ్చాడు. మనస్తాపానికి గురై గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న సీఐ సంఘటనా స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలు తెలుసుకొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఆదోనిఅర్బన్: పట్టణంలోని బండిమెట్ట కాలనీకి చెందిన రమేష్(28) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ సీఐ గోపీచంద్ తెలిపిన వివరాల మేరకు.. ఆదోని పట్టణం ఎస్‌కేడీ కాలనీలో సఫారీ బిల్డర్‌లో వాచ్‌మ్యాన్‌గా రమేష్ పనిచేస్తున్నాడు. అప్పుల బాధతో, కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై బుధవారం రాత్రి బిల్డింగ్‌లో వాచ్‌మ్యాన్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించి ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతునికి భార్య నాగవేణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అగ్రిగోల్డ్ బాండ్లు తీసుకెళ్లండి

కర్నూలు (లీగల్): లోపాలు కలిగిన రూ.10 వేలకు పైగా అగ్రిగోల్డ్ బాండ్లను కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఫిబ్రవరి 12వ తేదీ నుంచి ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వాపసు ఇస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సిహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల ప్రజలు తమ రశీదులను తీసుకుని వచ్చి ఒరిజినల్ బాండ్లను తీసుకోవచ్చని పేర్కొన్నారు.

శ్రీశైలం డ్యాంను సందర్శించిన కేంద్ర నిపుణుల బృందం



శ్రీశైలం డ్యాంపై ఇంజనీరింగ్ నిపుణుల బృందం

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలంలోని నీలం సంజీవరెడ్డిసాగర్ డ్యాంను గురువారం కేంద్ర నిపుణుల బృందం సందర్శించింది. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల ఒప్పందం మేరకు శ్రీశైలం డ్యాం, నాగార్జునసాగర్ డ్యాంల నిర్వహణ కృష్ణానదీ యాజమాన్య బోర్డ్ పరిధిలోకి రానున్నాయి. నీటి పంపకాలు, వినియోగంలో ఇరు రాష్ట్రాల మధ్య తలెత్తుతున్న వివాదాలకు బోర్డ్ పరిష్కారం చూపనుంది. ఇరు రాష్ట్రాలకు కేటాయించిన వాటాల నిష్పత్తిలో న్యాయం జరిగేలా చూడాలని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఈ నేపథ్యంలో గురువారం నిపుణుల బృందం శ్రీశైలం డ్యాంను క్షుణ్ణంగా పరిశీలించింది. డ్యాం ప్రస్తుత పరిస్థితి, నిర్వహణ, 2009వ సంవత్సరంలో వచ్చిన భారీ వరదలతో ప్లంజ్‌పూల్‌లో ఏర్పడిన గోతుల పరిమాణం, తదనంతరం గోతుల పరిధి పెరగకుండా వరదల సమయంలో రేడియల్ గేట్లను ఎలా నిర్వహించారనే అంశాలపై ఇంజనీర్లను ఆరా తీశారు. డ్యాం అంతర్భాగంలో ఉన్న 3 గ్యాలరీల నుంచి సీపేజీ వాటర్‌ను బయటకు తోడివేసే విధానాన్ని కూడా పరిశీంచారు. ఆప్రాన్ సిలిండర్లకు మరమ్మతులు, అప్రోచ్ రోడ్ నిర్మాణం, ప్లంజ్‌పూల్‌లో ఏర్పడిన గోతులను ట్రిమీ కాంక్రీట్‌తో పూడ్చవలసిన ఆవశ్యకత ఉందని నిపుణుల కమిటీ తేల్చి చెప్పింది. డ్యాంకు అవసరమైన ఇతర పనులపై కూడా శుక్రవారం నిపుణుల బృందం సమీక్ష నిర్వహించి కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖకు నివేదించనున్నది. శ్రీశైలం డ్యాం పరిశీలనలో నేషనల్ డ్యాం సేఫ్టీ అధారిటీ ముఖ్యులు వివేక్‌త్రిపాఠి, సభ్యులు కమలేష్‌జైన్, కృష్ణానదీ యాజమాన్య బోర్డ్ సభ్యులు ఆర్.వి.ప్రకాష్, కె.దక్షిణామూర్తి, సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ ఆర్.శరవనన్, సిఎస్ఎంఆర్ఎస్ సైంటిస్ట్ యు.ఎస్.విద్యార్థి, ఆంధ్రా ఎస్‌డిఎస్ఓ చీఫ్ ఇంజనీర్ టి.వి.ఎన్.ఎ.ఆర్‌కుమార్, తెలంగాణా ఎస్‌డిఎస్ఓ చీఫ్ ఇంజనీర్ టి.ప్రమీల శ్రీశైలండ్యాం చీఫ్ ఇంజనీర్ ఎస్.కబీర్‌బాషా, ఎస్ఇ పి.శ్రీరామచంద్రమూర్తి ఉన్నారు.

జెడ్పీలో ఏడుగురికి పదోన్నతి



పదోన్నతి పొందిన ఉద్యోగులతో జెడ్పీ చైర్మన్

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఆదేశాల మేరకు జెడ్పీ పరిధిలో అర్హత, సీనియారిటీ ఉన్న ఏడుగురు ఆఫీసు సబార్డినేట్లకు రికార్డు అసిస్టెంట్లు, ల్యాబ్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించినట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక జెడ్పీలోని చైర్మన్ చాంబర్‌లో పదోన్నతి పొందిన వారికి చైర్మన్ పాపిరెడ్డి పోస్టింగ్ ఆర్డర్స్ అందించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ పదోన్నతి పొందిన వారిలో రికార్డు అసిస్టెంట్లుగా యం శ్రీవాణి, కె.మౌనిక, బి.చైతన్య, టి.శ్రీదేవి, పి.సందీప్‌కుమార్, కె.సత్యనారాయణరెడ్డి.. ల్యాబ్ అసిస్టెంట్‌గా జి.జయమ్మకు పదోన్నతి లభించిందన్నారు. వీరికి ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖాళీగా ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పోస్టింగ్ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో పీఆర్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు లచ్చన్న, కలాం పాల్గొన్నారు.

ఖనిజ నిక్షేపాల సర్వేపై వర్క్‌షాప్

- హాజరైన ఉమ్మడి కర్నూలు జిల్లా మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): ఖనిజ నిక్షేపాల సర్వేపై గురువారం విజయవాడలో నిర్వహించిన వర్క్‌షాప్‌కు ఉమ్మడి కర్నూలు జిల్లా మైనింగ్ అధికారులు హాజరయ్యారు. వర్క్‌షాప్‌లో నేషనల్ జియో సైన్స్ డేటా రిపాజిటరీ (ఎన్‌జీడీఆర్) పోర్టల్‌లో ఉన్న సమాచారం, దానిని ఎలా వినియోగించుకోవాలి అన్న అంశాలపై అవగాహన కల్పించినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ ఫోన్ ద్వారా తెలిపారు. వర్క్‌షాప్‌కు తనతో పాటు బనగానపల్లె ఏడీ రాజగోపాల్, నంద్యాల ఏడీ రామచంద్ర హాజరయ్యారని పేర్కొన్నారు.

భవిత కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగు



రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకురాలు రాధిక

శిరివెళ్ల: సర్వశిక్షాబియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాల్లో సౌకర్యాలు మరింత మెరుగుపడ్డాయని రాష్ట్ర ఐఈఆర్‌పీ పరిశీలకురాలు డాక్టర్ రాధిక అన్నారు గురువారం మండల కేంద్రం భవిత కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రం రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతు రాష్ట్రంలో 672 కేంద్రాలున్నాయని, వాటిలో చెవిటి, అంగవైకల్యం, బుద్ధిమాంద్యం పిల్లలు చదువుతున్నారన్నారు. ఆట పాటలు, ప్రత్యేక భోదనలతో పిల్లలకు చదువు చెబుతున్నారన్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పిల్లలు ఉన్నారన్నారు. ప్రతి వారం డాక్టర్‌తో ఫిజియో థెరిపీ చేయుస్తున్నామన్నారు. పాఠశాలల విద్యార్థులతో సమానంగా పిల్లలకు మధ్యాహ్న భోజనం, డ్రస్సు, పాఠ్యపుస్తకాలు, ట్యాబ్‌లు, అమ్మఒడి అందుతున్నాయన్నారు. పిల్లలను కేంద్రాల సమీపంలో ఉన్న పాఠశాలలో అడ్మిషన్లు చేయుస్తున్నామన్నారు. ఎంఈఓల పర్యవేక్షణలో ఈ కేంద్రాలు నడుస్తున్నాయన్నారు. అందరికీ చదువుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆమె వెంట జిల్లా ఐఈఆర్‌పీ కోఆర్డినేటర్లు రఘరామిరెడ్డి, శ్రీనివాసులు, ఏంఈఓ శంకరప్రసాదు ఉన్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 21 మంది ప్రయాణికులకు గాయాలు
- క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన పోలీసులు



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు



కర్నూలు ఆసుపత్రిలో గాయపడిన ప్రయాణికురాలికి వైద్యం అందిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిపై గుట్టపాడు స్టేజీ సమీపంలో గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 21 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కర్నూలు ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నంద్యాల డిపోకు చెందిన అల్ట్రాడీలక్స్ ఆర్టీసీ బస్సు గురువారం కర్నూలుకు బయలుదేరింది. మార్గమధ్యలో గుట్టపాడు బస్సుస్టేజీ వద్దకు రాగానే, అప్పటికే అక్కడ టైర్ పంక్చర్ వేయించుకుని చెన్నై నుంచి రాజస్తాన్‌కు వెళ్తున్న లారీ నెమ్మదిగా రోడ్డు కుడిభాగం వైపుకు మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగం దెబ్బతిని, డ్రైవర్ రాముడు కాళ్లు స్టేరింగ్‌లో ఇరుక్కపోగా, ప్రయాణికులు తీవ్రంగా గాయపడి హాహాకారాలు చేశారు. అత్యవసర ద్వారం నుంచి అతికష్టం మీద బయటకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను హైవే పెట్రోలింగ్ వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో కర్నూలు నగరానికి చెందిన నాగజ్యోతి (వెంకటరమణకాలనీ) ఏడు నెలల గర్భిణి కాగా తీవ్ర రక్తస్రావమై గర్భం కోల్పోయినట్లు తెలుస్తోంది. అలాగే చిన్న (కల్లూరు), ప్రేమకుమార్‌రెడ్డి, అబ్దుల్ రహీమ్, ఖదర్‌వలి (ప్రకాష్‌నగర్) అలీ, వినోద్‌కుమార్, సులక్షణ, జయసూర్యారెడ్డి, మహబూబ్‌వలి, విజయరత్న, భరత్‌రెడ్డి, నాగరాజుకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. నక్కా మధుసూదన్ రావు, నక్కా దేవి, నక్కా కీర్తన, నంద్యాల దేవనగర్‌కు చెందిన గద్దం ఓబయ్య, గద్దం ఏంజిల్, విక్టోరికి మూగదెబ్బలు తగలగా, మరో పది మందికి స్వల్ప రక్తగాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. తహసీల్దార్ నటరాజ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి పేర్కొన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్

- డోన్ నియోజకవర్గానికి మరో రెండు పాలిటెక్నిక్ కళాశాలలు మంజూరు
- పట్టణంలో కృతజ్ఞత ర్యాలీ నిర్వహించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మాట్లాడుతున్న మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు



సభకు హాజరైన పార్టీ శ్రేణులు, ప్రజలు

డోన్: ఎడ్యుకేషనల్ హబ్‌గా మారిన డోన్ నియోజకవర్గానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అదనంగా మరో రెండు పాలిటెక్నిక్ కళాశాలలను మంజూరు చేయడం పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం కృతజ్ఞత తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. మంత్రి బుగ్గన చొరవతో ఇప్పటికే బేతంచెర్లలో పాలిటెక్నిక్, ప్యాపిలి మండలం హుసేనాపురంలో వెటర్నటీ పాలిటెక్నిక్ కళాశాలు ఏర్పాటు కాగా ప్రస్తుతం హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ మంజూరు కావడం పేద విద్యార్థులకు వరంగా మారింది. ఈ మేరకు సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహం నుంచి కోర్టు, పోలీసుస్టేషన్ మీదుగా పాతబస్టాండ్ వరకు సాగిన ఈ ర్యాలీలో ప్యాపిలి, బేతంచెర్ల, డోన్ మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాతబస్టాండ్ సమైక్యాంధ్ర కట్ట వద్ద జరిగిన సమావేశంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు మాట్లాడుతూ ఎన్నికల ముందు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మాట ఇచ్చి నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. విద్య, వైద్య రంగాలలో డోన్‌ను అగ్రభాగాన నిలిపేందుకు ఆర్థిక మంత్రి బుగ్గన ఎంతో కృషిచేశారని కొనియాడారు. డోన్‌కు వ్యవసాయ, ఫుడ్ ప్రాసెసింగ్, హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రభుత్వం మంజూరు చేయడం హర్షణీయమని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, డోన్, ప్యాపిలి జెడ్పీటీసీలు బద్దల రాజ్‌కుమార్, బోరెడ్డి శ్రీరాంరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి అన్నారు. నియోజకవర్గంలో గత 50 ఏళ్లలో జరగని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో పాటు మంత్రి బుగ్గన కేవలం రెండేళ్లలోనే చేసి చూపించారని వ్యవసాయ సలహామండలిచైర్మన్‌లు వెంకటేశ్వరరెడ్డి, చంద్రన్న, జిల్లా బిసి విభాగం అధ్యక్షులు పోస్టుప్రసాద్, డోన్, ప్యాపిలి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్‌లు మల్లెంపల్లె రామచంద్రుడు, బోరెడ్డి పుల్లారెడ్డి, వైఎస్ఆర్‌సిపి నాయకులు పెద్దపూజెర్ల భాస్కర్‌రెడ్డి, కమలాపురం అర్జున్‌రెడ్డి అన్నారు. డోన్ నుంచి గతంలో ఎన్నికై అనేక ఉన్నత పదవులు పొందిన వారు ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని చూసి తలదించుకోవాలన్నారు. అనంతరం పాతబస్టాండ్‌లో కార్యకర్తలు పెద్దఎత్తున బాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జలదుర్గం రసూల్, చిరంజీవి, కురుకుందు హరి, గజేంద్రనాథ్‌రెడ్డి, బొర్రా మల్లికార్జునరెడ్డి, నాగభూషణరెడ్డి, బేతంచెర్ల పార్టీ నాయకులు చంద్రశేఖర్, నిరంజన్, సాయికిరణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.